ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3
కర్ణాటక వార్తలు
సోమవారం 28 అక్టోబరు 2024

30న ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని బెంగళూరు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పట్టణాలకు ఈనెల 30న ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు బెంగళూరు ఏటీఎం రవీంద్ర రెడ్డి ప్రకటనలో తెలిపారు. విజయవాడ, నెల్లూరు, కర్నూలు, కడప, ప్రొద్దుటూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతితోపాటు ఏపీలోని పలు పట్టణాలకు రెగ్యులర్ సర్వీసులతోపాటు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. దీపావళికి వెళ్లే ప్రవాసాంధ్రుల సౌకర్యార్థం ఈ బస్సులు నడుపుతామన్నారు. ఇందులో సాధారణ చార్జీలే ఉంటాయని ఆయన వివరించారు.

మైసూరుకు రెండుసార్లు స్వచ్ఛనగరంగా గుర్తింపు
నేటికీ జిల్లాలో నిర్మాణానికి నోచుకోని
16వేల మరుగుదొడ్లు
వ్యాధులు ప్రబలుతున్నా పట్టించుకోని అధికారులు
సీఎం సొంత జిల్లాలోనే దారుణ పరిస్థితి
ప్రభుత్వం మేల్కోవాలంటున్న సామాజిక వేత్తలు



బహిర్భూమి కష్టాలు ఇంకెన్నాళ్లు..?

జిల్లాలో కుటుంబాల సంఖ్య

హుణసూరు తాలూకా	59,692
హెచ్‌డీ కోటె	48,057
కేఆర్ నగరలో	24,666
మైసూరు	54,811
నంజనగూడులో	89,106
పెరియపట్టణ	54718
సాలిగ్రామలో	20,574
సరగూరు	32,938
టి నరసీపుర	60,340
మొత్తం	4,45,062

మరుగుదొడ్లులేని కుటుంబాలు

హెచ్‌డి కోటె	3,199
హుణసూరు	1490
కేఆర్ నగర	1387
మైసూరు	1,149
నంజనగూడు	2107
పెరియపట్టణ	1125
సాలిగ్రామ	2130
సరగూరు	2,299
టి నరసీపుర	1463
మొత్తం	16,349

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ప్రయోగాత్మక సమీక్ష స్వచ్ఛభారత అభియానలో మైసూరును సంపూర్ణ మరుగుదొడ్ల నిర్మించిన నగరంగా గుర్తించారు. అయితే మైసూరు జిల్లా పరిధిలో ఇంకా అనాగరికమైన బహిర్భూమి సంప్రదాయం కొనసాగుతోంది. సీఎం సిద్దరామయ్య సొంత జిల్లాలోనే ఈ విధానం కొనసాగడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. నాలుగు దశాబ్దాలుగా సిద్దరామయ్య రాజకీయాల్లో మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా, అత్యంత ఎక్కువసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రిగా ఖ్యాతి గడించారు. రెండో విడతతో కలిపి ఆరున్నరేళ్లపాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. నెలలో కనీసం వారం రోజులపాటు మైసూరులో గడుపుతారు. సిద్దరామయ్యకు రాజకీయంగా ఎదిగేందుకు కారణమైన జిల్లాగానే కాకుండా ఆయన ప్రాతినిధ్యం వహిస్తూ ఇష్టపడే జిల్లాగా ఎక్కువకాలం గడిపే మైసూరు జిల్లాలోనే బహిర్భూమి సంస్కృతి ఇంకా కొనసాగడం దురదృష్టకరమనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర నగరాభివృద్ధి మంత్రిత్వశాఖ మైసూరును స్వచ్ఛనగరిగా రెండుసార్లు ప్రకటించింది. ఉత్తరభారత్‌లో మరుగుదొడ్లు లేని కారణంగా భర్తల ఇంటికి వెళ్లేందుకు భార్యలు వెనుకడుగు వేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే మైసూరుకు ఎంతో చరిత్ర ఉంది. వందేళ్లక్రితమే ఇక్కడ యూనివర్సిటీ, దశాబ్దాల కిందటే మెడికల్ కళాశాలతోపాటు పర్యాటక నగరిగా సుపరిచితమైనది. అటువంటి జిల్లా ప్రజలు మలమూత్ర విసర్జనకు బయలుప్రదేశాన్ని ఆశ్రయిస్తున్నారు. 2016లో జాతీయ మోడల్ సర్వేలో స్వచ్ఛభారత అభియానలో మైసూరును బహిర్భూమి రహిత నగరంగా ప్రకటించారు. కానీ ప్రశంస పొందిన 8 ఏళ్ల తర్వాత కూడా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ మరుగుదొడ్లు సాధ్యం కాలేదు. బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయడం ద్వారా వేగవంతంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతాయనేది పలు సర్వేలు నిర్ధారించాయి. ప్రధానంగా కలరా, అతిసార, టైఫాయిడ్ వంటి జబ్బులు ప్రబలే అవకాశం ఉంది. మైసూరు నగరంలో కూడా కొన్ని ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేకుండానే జీవించేవారు ఉన్నట్లు తెలుస్తోంది.

కారణాలెన్నో..

జిల్లాలో మరుగుదొడ్లు లేకపోవడానికి ఎన్నో కారణాలున్నాయని చెప్పవచ్చు. ఉమ్మడి కుటుంబాలు విభజన జరిగినప్పుడు రెండుమూడు కొత్త సంసారాలు ఏర్పడతాయి. వారికి ఆదాయ వనరులు సమగ్రంగా ఉంటే సొంతిళ్లు లేదా అద్దెకు వెళ్లే చోట మరుగుదొడ్లకు ప్రాధాన్యం ఇస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకమైన ఇల్లు ఏర్పాటు చేసుకోవడమే సవాల్‌గా ఉంటుంది. అదనంగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు వెనుకడుగు వేస్తారు. ప్రభుత్వం నిర్మించే ఇళ్లకు తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్ల ఉండాలనేది నిబంధన. ఇంటి నిర్మాణాలకే అప్పులు చేశామని అదనంగా భరించలేమని పలువురు దాటవేస్తుంటారు. ఇలా ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిర్మించిన ఇళ్లకు వ్యక్తిగత మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. జిల్లావ్యాప్తంగా జరిపిన స్పెషల్ డ్రైవ్‌లో సిటిజన్ యాప్ ద్వారా 16,304 మంది మరుగుదొడ్లకు దరఖాస్తు చేసుకున్నారు. మరో 5 నెలల్లో సంపూర్ణంగా మరుగుదొడ్లు నిర్మిస్తామని జిల్లా పంచాయతీ డెవలెప్‌మెంట్ సెక్రటరీ డాక్టర్ కృష్ణరాజు తెలిపారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం, డీసీఎం తదితరులు

సమష్టిగా పనిచేయాలి..

- మూడు స్థానాల్లో గ్యారెంటీగా విజయం సాధించాలి
- మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం పిలుపు
- మంత్రుల గైర్హాజరుపై సుర్జేవాలా ఆగ్రహం

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలు జరుగుతున్న మూడు స్థానాల్లో గెలవాలని, నేతలందరూ సమష్టిగా పనిచేయాలని సీఎం సిద్దరామయ్య సూచించారు. ఆదివారం అధికారిక నివాసం 'కృష్ణ' నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీసీఎం డీకే శివకుమార్ బెంగళూరునుంచి భాగస్వాములు కాగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా ఢిల్లీ నుంచి పాల్గొన్నారు. శిగ్గావి, సండూరు, చన్నపట్టణ స్థానాల్లో విజయం సాధించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు సమష్టిగా పనిచేయాలని, స్థానిక నాయకులు విబేధాలు లేకుండా అందరినీ కలుపుకుని పోవాలన్నారు. అధికారంలో ఉన్నామనేది మరువరాదన్నారు. ఐదు గ్యారెంటీలతో పాటు ప్రజా సంక్షేమాలను ప్రజలకు వివరించాలన్నారు. భిన్నాభిప్రాయాలు, అసంతృప్తులకు తావులేకుండా కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతిపక్షాలు అవినీతి ఆరోపణలే ప్రచారాస్త్రంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ముడా ఇంటి స్థలాల వివాదం, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిపై ప్రతిపక్షాల ఆరోపణలకు ధీటుగా సమాధానం చెప్పాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి 30మంది మంత్రులు, ఎమ్మెల్యేలను కేటాయిస్తామని వారు స్థానికంగాను అందుబాటులో ఉంటూ కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు 13మంది మంత్రులు మాత్రమే హాజరవడం, మిగతావారు గైర్హాజరవడంపై సుర్జేవాలా మండిపడ్డారు. అరగంట వీడియో కాన్ఫరెన్స్‌కు సమయం కేటాయించలేరా..? అంటూ విరుచుకుపడ్డారు. సీఎం సిద్దరామయ్య కొందరు మంత్రులు ముందస్తుగా అనుమతులు తీసుకున్నారని వివరించినట్లు తెలిసింది.



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రులు



అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న దృశ్యం

నగరంలో బుల్‌డోజర్ల

హవా..!

- రాజకాలువ ఆక్రమణలపై చర్యలకు డీసీఎం ఆదేశం

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలో బుల్‌డోజర్ల హవా కొనసాగుతోంది. అక్రమ కట్టడాల కూల్చివేతకు అధికారులు ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు. బెంగళూరు నగర వ్యాప్తంగా ఇటీవల ఒకటి రెండు రోజుల వర్షానికే పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. అందుకు ప్రధాన కారణంగా రాజకాలువలు సక్రమంగా లేకపోవడమే అనేది పరిశీలనలో తేలింది. భవిష్యత్తులో వరద ముంపు తలెత్తకుండా ఉండాలంటే రాజకాలువల ఆక్రమణలను తొలగించాల్సిందేనని డిప్యూటీ సీఎం, బెంగళూరు అభివృద్ధిశాఖ మంత్రి డీకే శివకుమార్ అధికారులను ఆదేశించారు. దీంతో వారంలోనే బీబీఎంపీ రాజకాలువలు, చెరువుల ఆక్రమణల తొలగింపునకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. రెండేళ్లక్రిందట ఇటువంటి ప్రక్రియ ప్రారంభించారు. అయితే కొన్ని రోజులకే అధికారులు మౌనంగా ఉండిపోయారు. అందుకు కారణం రాజకీయ ఒత్తిళ్లే అని గుసగుసలు వినిపించాయి. ప్రత్యేకించి రాజరాజేశ్వరినగర్‌లో నటుడు దర్శన్, కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే శ్యామనూరు శివశంకరప్పకు చెందిన భవనాలు తొలగించేందుకు గతంలోనే మార్కులు వేశారు. వాటిని తొలగించాలని అధికారులు సిద్ధమైనా కోర్టు పరమైన అడ్డంకులు, రాజకీయ జోక్యం వెంటాడింది. రాజరాజేశ్వరినగర్‌లో ఆక్రమణలు తొలగించాలనేది కొన్నేళ్లకాలంగా సాగుతున్న ప్రక్రియ.

ఇటీవల భారీ వర్షంతో బ్యాటరాయనపుర నియోజకవర్గ పరిధిలోని కోగిలు క్రాస్, కేంద్రీయవిహార్‌తో పాటు సహకారనగర్‌లో పలు అపార్ట్‌మెంట్‌లు వరదముంపులో చిక్కుకున్న విషయం తెలిసిందే. సుమారు 600 కుటుంబాలను రబ్బర్‌బోట్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది. ఈ పరిణామం భవిష్యత్తులో చోటు చేసుకోకుండా ఉండాలంటే ఆక్రమణలు తొలగించాల్సిందేనని నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

1712 అక్రమ కట్టడాల గుర్తింపు

ఇప్పటికే నగర వ్యాప్తంగా 1712 నిర్మాణాలు రాజకాలువను ఆక్రమించుకున్నట్లు నివేదిక సిద్ధంగా ఉంది. అందులో 196 నిర్మాణాలకు సంబంధించి కేసులు విచారణ దశలో ఉన్నాయి. 167 కట్టడాల సర్వే ప్రక్రియ ముగిసింది. తహసీల్దార్ల ఆదేశాలిచ్చిన వెంటనే బీబీఎంపీ బుల్‌డోజర్‌లను సిద్ధం చేసుకునేందుకు కసరత్తు సాగిస్తోంది. 1712 నిర్మాణాల్లో 300 ప్రదేశాలు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే వీరు నివాసాలను ఖాళీ చేశారు. మరో 800 ప్రాంతాల్లో తొలగించాల్సి ఉంది. బెంగళూరు తూర్పు డివిజన్‌లో 123, పశ్చిమ, దక్షిణలో 46 చొప్పున, కోరమంగల 104, యలహంక 359, మహదేవపుర 492, బొమ్మనహళ్ళి 201, ఆర్‌ఆర్ నగర్ 104, దాసరహళ్ళి 207 వివాదాస్పద స్థలాలుగా గుర్తించారు.



పాటరీటౌన్‌లో తయారవుతున్న దీపాలు

దీపావళికి సిద్ధమవుతున్న దివ్వెలు..



దీపాలు కొనుగోలు చేస్తున్న యువతులు



ఎండలో ఆరబెడుతూ..



బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వెలుగుల పండగకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ముఖ్యంగా దీపావళికి కీలకమైనవి ఇంటింటా వెలిగించే మట్టిదీపాలు. ఎన్నిరకాల దీపాలు వచ్చినా మట్టి దీపాలకు క్రేజ్ తగ్గేది ఉండదు. మట్టిదీపాలను వెలిగించి లక్ష్మీపూజ ఆచరించడం ఆనవాయితీ. బెంగళూరులో పాటరీటౌన్ ప్రాంతంలో నేటికీ ఎంతోమంది మట్టి కుండలు, దీపాల తయారీ ద్వారానే జీవనం సాగిస్తున్నారు. దీపావళి పండుగకోసం సుమారు రెండు నెలలుగా తయారు చేసిన దీపాలను నగరంలోని అన్ని ప్రాంతాల్లో విక్రయాలకు సిద్ధం చేస్తారు. మట్టి దీపాలను వెలిగించడం ద్వారా పర్యావరణానికి మేలు చేసిన వారు అవుతారని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. అందుకు అనుగుణంగానే నగరంలోని జయనగర్, బసవనగుడి, మల్లేశ్వరం, ఎలక్ట్రానిక్‌సిటీ, కోరమంగల, హెబ్బాళ, యలహంక, కేఆర్ పురం, జేపీ నగర్ ఇలా వందలాది ప్రాంతాల్లో మట్టి దీపాల విక్రయాలు జోరందుకున్నాయి.



తుది మెరుగులు దిద్దుతూ..



విద్యార్థి తలను నిమురుతున్న ముచ్చుకోతి

ఆశీర్వాద యోగం..!

కంప్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యోగా చేస్తున్న విద్యార్థిని నల్లముచ్చు కోతి ఆత్మీయంగా ఆశీర్వదించింది. కంప్లి పరిధిలోని దేవలాపురం గ్రామం కొత్త నగర్ పాఠశాలలో శనివారం విద్యార్థులు యోగా చేస్తున్నారు. 4వ తరగతి విద్యార్థి మల్లికార్జున వద్దకు నల్లముచ్చుకోతి చేరుకుని ఆప్యాయంగా తల నిమురుతూ చాలా సేపు గడిపింది. విద్యార్థి ఎలాంటి భయానికి లోను కాకుండా ధైర్యంగా యోగాలో పాల్గొన్నాడు. సాక్షాత్తు హనుమంతుడే ఆశీర్వదించారని అక్కడ ఉన్న వారంతా చర్చించుకున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిద్దాం

- ఏపీ ప్రభుత్వానికి శక్తిని నింపుదాం
- అభ్యర్థుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీలుగా పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించుకుందామని తద్వారా ఏపీ ప్రభుత్వానికి శక్తినిద్దామని ఎమ్మెల్సీ అశోక్‌బాబు పిలుపునిచ్చారు. బెంగళూరు తెలుగుదేశం ఫోరం ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణ, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. మారతహళ్లిలోని కృష్ణ సమ్మిట్‌లో ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి, కంచర్ల శ్రీకాంత్‌తోపాటు కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఉభయ గోదావరి జిల్లా అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు టీడీపీ అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకాలు మినహా అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. శాసనసభలో ప్రభుత్వానికి తిరుగులేని బలం ఉందన్నారు. పరిషత్‌లోనూ ప్రభుత్వ నిర్ణయాలకు ఆమోదం లభించాలంటే ఎమ్మెల్సీల సంఖ్య పెరగాల్సి ఉందన్నారు. టీడీపీ ఫోరం పార్టీ ప్రగతికి, ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి క్రియాశీలకంగా వ్యవహరించిందన్నారు. రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి గెలుపుకోసం ఫోరం సభ్యుల కృషి మరువలేమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రెండు స్థానాల అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు రిజిస్ట్రేషన్ అంశాన్ని వివరించారు. అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కృష్ణ, గుంటూరు జిల్లాలకు చెందిన వారు బెంగళూరులో ఉద్యోగ, వ్యాపారులతో స్థిరపడినవారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాల అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ రెండు జిల్లాలకు చెందినవారు వ్యాపారాలతోపాటు ఉద్యోగ, ఐటీ, ఇతరత్రా రంగాల్లో స్థిరపడినవారిని కలిసేందుకు బెంగళూరుకు వచ్చామన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పాటుతో ఏపీ ప్రజలు సంతోషంగా ఉన్నారని గత ఐదేళ్ల అరాచకానికి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్, బెంగళూరు టీడీపీ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కనకమేడల వీర, వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీమన్యం తోపాటు సోంపల్లి శ్రీకాంత్, కోకా కేశవ్ పాల్గొన్నారు.



వేదికపై ఎమ్మెల్సీ అశోక్‌బాబు తదితరులు



సైక్లింగ్ పోటీలో ఎంపీ

ఐరన్‌మ్యాన్ విజేత తేజస్విసూర్య

- తొలి ప్రజాప్రతినిధిగా రికార్డు

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐరన్‌మ్యాన్ 70.3 రేసులో విజేతగా బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య విజేతగా నిలిచారు. గోవాలో ఆదివారం జరిగిన వాకింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్ పోటీల్లో రాణించిన తొలి ప్రజాప్రతినిధిగా రికార్డు సృష్టించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చిన ఫిట్ ఇండియా అభియానకు ఇది స్ఫూర్తి అని తేజస్విసూర్య వెల్లడించారు. 1900 మీటర్ల స్విమ్మింగ్, 90 కిలోమీటర్ల సైక్లింగ్, 21.1 కిలోమీటర్ల రన్నింగ్‌తో కలిపి మూడింటిని 8గంటల 27 నిమిషాల్లో పూర్తి చేశారు. లోక్‌సభ సభ్యుల భాగస్వామ్యంతో క్రీడామనోభావాలు పెంపొందింప చేస్తాయనేందుకు ఇదొక ఉదాహరణ అయ్యింది. ఈ సందర్భంగా ఎంపీ తేజస్వి సూర్య గోవాలో మీడియాతో మాట్లాడుతూ గోవా ఐరన్‌మ్యాన్ పోటీలు ప్రముఖ క్రీడల్లో ఒకటిగా ఉందన్నారు. 50కి పైగా దేశాల క్రీడాకారులు రేసులో పాల్గొన్నారన్నారు. మూడింటిలోనూ ఉత్సాహంగా పాల్గొన్నానని తెలిపారు.





టపాసుల దుకాణాల వద్ద బారులుతీరిన కార్లు

హోసూరు.. టపాసుల జోరు..!

హోసూరు అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హోసూరులో టపాసుల అమ్మకాలు జోరందుకున్నాయి. దీపావళి సమీపిస్తుండంతో బెంగళూరు తదితర ప్రాంతాలవారు పెద్దసంఖ్యలో కొనుగోళ్లకు వస్తున్నారు. ఈనెల 31న దేశవ్యాప్తంగా దీపావళీ పండుగను జరుపుకోనున్న తరుణంలో ఎటు చూసినా సందడి నెలకొంది. హోసూరులో హోల్‌సేల్‌గా కొనుగోలు చేసేవారికి భారీగా డిస్కౌంట్ ఇస్తుంటారు. బెంగళూరు కన్నా ధరలు తక్కువగా ఉంటాయి.

ఏడుస్తూనే హరినామ సంకీర్తన చేస్తున్న ఇస్కాన్ భక్తులు






శ్రీధర్ ప్రభు కుమారుడు కృష్ణ



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇస్కాన్ భక్తుల భౌతికకాయాలను దర్శించుకునేందుకు వచ్చిన జనం



శంఖం ఊదుతున్న భక్తుడు



రోదిస్తున్న ప్రణవ్ సోదరుడు భువన్

జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు

బరువెక్కిన హృదయాలతో అంతిమ సంస్కారాలు

కన్నీటి వీడ్కోలు



ప్రణవ్ భౌతికకాయం వద్ద రోదిస్తున్న తల్లి చంద్రలేఖ

ఇస్కాన్ భక్తులకు వేలాదిగా నివాళి

నిత్యం శ్రీకృష్ణ నామ స్మరణలతో...
తన్మయత్వం చెందిన భక్తుల నృత్యాలతో
ఆనంద తరంగాలతో శోభించిన ఆ ప్రాంతం
గుండెలు పగిలే బాధతో శోకించింది.

శ్రీకృష్ణ నామ సంకీర్తనలతో
ఎందరిలోనో భక్తి భావం మేల్కొలిపిన
ఆ భక్త బృందం లేరని తెలిసి
ఉబికి వస్తున్న కన్నీటితో శోక సంద్రమైంది.

భక్తుల బృందగానాలతో
అలరారిన శ్రీ కృష్ణ మందిరం
పట్టరాని బాధతో
బరువెక్కిన హృదయాలకు వేదికైంది.

గుండెల్లో ప్రజ్వరిల్లుతున్న బడబాగ్నిని
ఉబికి వస్తున్న కన్నీళ్లతో చల్లార్చుకుంటూ
వాయులీనమై, పరాంధాముడిలో ఐక్యమైన
భక్తశేఖరులకు తుది వీడ్కోలు పలికింది.

నార్పల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్కాన్ మందిర భక్త బృందానికి ఆదివారం తుది వీడ్కోలు పలికారు. భక్తుల సందర్శనార్థం మృతదేహాలను ఇస్కాన్ మందిరం వద్ద ఉంచారు. కుటుంబ సభ్యులు, బంధువులు, భక్తుల రోదనలతో ఆ ప్రాంతం శోక సంద్రమైంది.



బాధాతప్త హృదయంతో శ్రీకాకుళం పయనమవుతున్న షణ్ముఖ్ తండ్రి సాంబమూర్తి

అనంతపురం కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్కాన్ మందిర భజన బృంద సభ్యులకు వందలాదిమంది నడుమ ఆదివారం కన్నీటి వీడ్కోలు పలికారు. తాడిపత్రిలోని ఓ గృహంలో శనివారం శ్రీకృష్ణ సంకీర్తన నిర్వహించి తిరిగి అనంతపురానికి వస్తుండగా నాయనపల్లి క్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో శ్రీనివాసులు అలియాస్ శ్రీధర్, షణ్ముఖ్, సంతోష్‌కుమార్, వెంకటేష్, లక్ష్మీప్రసన్నకుమార్‌రెడ్డి, ప్రనీత్ ప్రణవ్ సాయిరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన జిల్లా ప్రజలకు దిగ్భ్రాంతి కలిగించింది. మృతదేహాలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఆదివారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం భౌతికకాయాలను ఇస్కాన్ భక్తుల సందర్శనార్థం నగర శివారులోని ఇస్కాన్ మందిరానికి తరలించారు. ఈ సందర్భంగా మృతుల బంధువులతోపాటు వందలాదిమంది ఇస్కాన్ మందిరానికి చేరుకుని తుదివీడ్కోలు పలికారు. మృతులంతా ఇస్కాన్ మందిర సేవలో ఉన్నవారే కావడంతో భక్తులంతా కన్నీరు మున్నీరయ్యారు.

జిల్లా నలుమూలల నుంచి కదిలొచ్చిన భక్తజనం

ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఈ బృందం చురుగ్గా పాల్గొనేవారు. ప్రధానంగా నగర సంకీర్తనల్లో ఎంతో ఉత్సాహంగా భక్తిగీతాలాపనలు చేస్తూ భక్తుల్లో ఎంతో ఉత్సాహం రేకెత్తించేవారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వీరు నగర సంకీర్తనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అనేక మంది భక్తులతో వీరికి ఎంతో అనుబంధం ఏర్పడింది. వీరి మృతి విషయం తెలుసుకొని జిల్లావ్యాప్తంగా ఈ బృందంతో ఆధ్యాత్మిక అనుబంధం కలిగినవారంతా వందలాదిగా తరలి వచ్చి భౌతికకాయాలను సందర్శించి కన్నీటి పర్యంతమయ్యారు.



భౌతికకాయాల వద్ద హరేకృష్ణ... హరేరామ నామస్మరణ చేస్తున్న ఇస్కాన్ బృందం

బరువెక్కిన హృదయాలతో అంతిమ సంస్కారాలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్కాన్ భక్తులకు బంధువులు, భక్తుల సమక్షంలో బరువెక్కిన హృదయాలతో కుటుంబ సభ్యులు అంతిమ సంస్కా రాలు నిర్వహించారు. ఉబికివస్తున్న కన్నీళ్లను అదుపు చేస్తూ, గుండెలు పగిలే బాధ ఉన్నప్పటికీ హరేరామ, హరే కృష్ణ అంటూ సంకీర్తన సాగించారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పహాడ్‌పల్లి గ్రామానికి చెందిన షణ్ముఖ్, నాగిరెడ్డిపల్లికి చెందిన లక్ష్మీప్రసన్న కుమార్‌రెడ్డి మృతదేహాలను వారి తల్లిదండ్రులు ప్రత్యేక అంబులెన్సుల ద్వారా వారి స్వస్థలాలకు తీసుకెళ్లారు. అనంతరం శ్రీధర్ ప్రభు, సంతోష్‌కుమార్, వెంకటేష్, ప్రనీత్‌ప్రణవ్ సాయిరెడ్డి భౌతికకాయాలను కైలాసరథాల్లో ఉంచి నగరంలో అంతిమయాత్ర నిర్వహిస్తూ గుత్తిరోడ్డులోని హరిశ్చంద్రఘాట్‌కు తరలించారు. అక్కడ హిందూ సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.



శ్రీధర్ మృతదేహం వద్ద కన్నీటి పర్యంతమవుతున్న ఆయన సతీమణి దివ్య

నా ప్రభువును నా వద్దే ఉంచండి

పెళ్లయిన ఐదేళ్లకే భర్తను కోల్పోయి, భర్త మృతదేహంపై పడి రోదిస్తున్న దివ్య ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. నాలుగేళ్ల నా కుమారుడు కృష్ణ మురిపెం కూడా చూడకుండానే తండ్రి లేకుండా చేసావా భగవంతుడా. మేమెవరికోసం బతకాలి దేవుడా అంటూ శ్రీధర్ ప్రభు(శ్రీనివాసులు) సతీమణి ఏడుపు చూసిన వారంతా కంటతడి పెట్టుకున్నారు. నా శ్రీధర్ ప్రభువును నావద్దనే ఉంచండి... ఎక్కడికీ తీసుకెళ్లద్దండి అంటూ ఆమె ఏడవడం అందరినీ కలచివేసింది.

-దివ్య, శ్రీధర్ ప్రభు(శ్రీనివాసులు) సతీమణి

కంటతడి పెట్టిన ఎమ్మెల్యే దగ్గుపాటి



ఇస్కాన్ మందిరం వద్ద ఏర్పాటు చేసిన ఇస్కాన్ భక్తుల మృతదేహాలను చూసి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా మృతుల భౌతికకాయాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చే ప్రయత్నం చేశారు. అయితే వారి రోదనలను చూసి ఆయనకూడా కన్నీరు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ శ్రీకృష్ణుని సేవలో ఉన్న యువకులంతా ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. వారి కుటుంబాలను ఆదుకుంటామన్నారు.



ఇస్కాన్ భక్తులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



ఇస్కాన్ భక్తుల అంతిమయాత్ర



అంబులెన్సులో షణ్ముఖ్ భౌతికకాయాన్ని శ్రీకాకుళానికి తరలిస్తున్న దృశ్యం

వీరి కీర్తనలు వినేందుకే భగవంతుడు తీసుకెళ్లాడు



శ్రీధర్ ప్రభు బృందం పాడే కీర్తనలు చాలామందిలో భక్తిభావాలు కలిగించాయి. వీరి కీర్తనలను ఇష్టపడనివారుండరు. అందుకేనేమో శ్రీకృష్ణ పరమాత్ముడు కూడా వీరి కీర్తనలను వినాలని తనదగ్గరకు తీసుకెళ్లాడేమో..! అనంతపురంలో ఇస్కాన్ మందిర ఆరంభం నుంచి సభ్యుడిగా కొనసాగుతున్నాను. వీరి మృతి నా జీవితంలో ఏనాడూ కలగనంత మనోవేదనను మిగిల్చింది.

-శ్రీపాద వేణు, ఇస్కాన్ అనంతపురం సభ్యుడు



ఫీల్డ్ అసిస్టెంట్ పట్టా చేయించుకుని సాగుచేస్తున్న భూమి

ఫీల్డ్ అసిస్టెంట్ మరి..!


- నాలుగెకరాలకు భార్య పేరుతో అక్రమంగా పట్టా
- వైసీపీ పాలనలో ఆన్‌లైన్‌లోకి సైతం..
- బాధితుల ఫిర్యాదుతో ఐదేళ్ల తర్వాత వెలుగులోకి..



ఫీల్డ్ అసిస్టెంట్‌కు రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసు

యాడికి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా తన భార్య పేరుతో చేయించుకున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాడికిలోని సర్వే నెంబరు 422-బీలో ప్రభుత్వ మిగులు భూమి సుమారు 40ఎకరాలు ఉంది. ఇందులో కొంతభాగం ఏడు నెంబర్లలో వివిధ వ్యక్తులకు పట్టాలు ఇచ్చారు. ఈ భూములపై కన్నేసిన ఫీల్డ్ అసిస్టెంట్ ధనాంజనేయులు 2019లో ఎన్నికల విధుల నిమిత్తం యాడికికి వచ్చిన ఒక అధికారిని ప్రలోభ పెట్టి తన భార్య పేరుతో నాలుగు ఎకరాల భూమిని పట్టా చేయించుకొని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడు. ఇదే భూమిని గతంలో చిన్నబాలన్న అనే దళితుడికి ఇచ్చి ఉన్నారు. అతడి కుటుంబికులు ఈ భూమి విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఫీల్డ్ అసిస్టెంట్ భూబాగోతం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఆరాతీసిన రెవెన్యూ అధికారులు సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌కు మూడు నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించ లేదని తెలిసింది. దీనిపై రెవెన్యూ అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఒత్తిడి చేయడంతో అతను వైసీపీ నాయకులను ఆశ్రయించినట్లు సమాచారం. దీంతో ఓ వైసీపీ నాయకుడు తన అనుచరులతో రెవెన్యూ కార్యాలయానికి వచ్చి గ్రామస్థాయి రెవెన్యూ అధికారిని బెదిరించినట్లు కార్యాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు.

బెదిరింపులకు లొంగని రెవెన్యూ సిబ్బంది



సదరు భూమిని ఆన్‌లైన్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ తన భార్య పేరుతో నమోదు చేయించుకున్న దృశ్యం

ఫీల్డ్ అసిస్టెంట్ భూ ఆక్రమణను అరికట్టే దిశలో బెదిరింపులు ఎదురైనా రెవెన్యూ సిబ్బంది లొంగకుండా చర్యలు చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఆక్రమించిన భూమిని గతంలో రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చిన వ్యక్తులకు చెందేలా చర్యలకు ఉపక్రమించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ రెవెన్యూ అధికారులతో బేరసారాలకు దిగినట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. తాను పట్టా చేయించుకున్న నాలుగు ఎకరాల భూమిలో హరిజన చిన్నబాలన్నకు ఉన్నది రెండు ఎకరాల భూమి మాత్రమే అని, మిగిలిన భూమి తన భార్య పేరుతో అలాగే ఆన్‌లైన్‌లో ఉంచాలని వేడుకున్నట్లు సమాచారం. దీనికి లొంగని రెవెన్యూ అధికారులు ప్రభుత్వ నిబంధనల మేరకు మిగులు భూములు ప్రభుత్వానికి చెందాల్సిందేనని చెప్పినట్లు సమాచారం. అలాగే తాను ఆక్రమించుకున్న భూమికి తనకు ఎటువంటి సంబంధం లేదని లేఖ కూడా రాయించుకున్నట్లు తెలిసింది. దీనిని ఉన్నతాధికారులకు నివేదించి ఫీల్డ్ అసిస్టెంట్ ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకొనే దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

రెవెన్యూ అధికారికి వైసీపీ హెచ్చరిక

ఫీల్డ్ అసిస్టెంట్ భూ ఆక్రమణకు మద్దతుగా పదిరోజుల కిందట వైసీపీ నాయకులు రెవెన్యూ కార్యాలయానికి పెద్దఎత్తున వచ్చారు. గ్రామస్థాయిలో ఉండే రెవెన్యూ అధికారిని హెచ్చరించినట్లు స్థానికుల సమాచారం. ఇక్కడి నుంచి నీవు బదిలీ అయినా ఇంకా ఎందుకు ఇక్కడే ఉంటున్నావ్ వెళ్లి పోవచ్చు కదా అని ఆ అధికారిని పరుష పదజాలంతో హెచ్చరించారు. మా ఉన్నతాధికారులు నన్ను రిలీవ్ చేసినప్పుడు నేను ఇక్కడి నుంచి వెళతాను మీరెవరు నన్ను ప్రశ్నించడానికి అని ఆ అధికారి కూడా దీటుగా సమాధానం ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది.

ఫీల్డ్ అసిస్టెంట్‌తో స్టేట్‌మెంట్ తీసుకున్నాం

422-8 భూమిని ఫీల్డ్ అసిస్టెంట్ గతంలో తన భార్య పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్న మాట వాస్తవమే. దీనిపై వారికి నోటీసులు జారీచేశాం. వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నాం. దీనిని ఆర్డీఓ ద్వారా డీఆర్వోకు పంపించాల్సి ఉంది. అధికారుల ఆదేశాలతో ఆ భూమిని ప్రభుత్వానికి చెందేలా చేస్తాం. - రమేష్, వీఆర్వో యాడికి

టపాసులతో జాగ్రత్త

అక్రమంగా విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు : ఎస్పీ



అనంతపురం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చట్ట వ్యతిరేకంగా టపాసులు విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. బాణసంచా విక్రయ లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే టపాసులు విక్రయించాలని, లేని వారు ఎవరైనా అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీపావళిని పురస్కరించుకుని జిల్లాలో లైసెన్స్ కలిగిన దుకాణదారులు పాటించాల్సిన నియమ, నిబంధనలు, ప్రజలు, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్పీ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాత్కాలిక లైసెన్స్‌దారులు ప్రభుత్వ యంత్రాంగం సూచించిన బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 18సంవత్సరాలలోపు పిల్లలను విక్రయ పనుల్లో ఉంచుకోరాదన్నారు. నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు కాల్చాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ప్రమాదం జరిగినా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్-100/112 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరవేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గిరిప్రసాద్

అనంతపురం విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ రిపోర్ట్ వచ్చేలోపు ఉద్యోగులు,ఉపాధ్యాయులకు దీపావళి కానుకగా వెంటనే 30 శాతంఐఆర్ ప్రకటించాలని పీఆర్టీయూ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గిరిప్రసాద్ కోరారు. ఆదివారం ఆ సంఘం నాయకులు యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు, ఉపాధ్యాయులు జీతాలు వెంటనే వేస్తుండటం హర్షణీయమన్నారు. ఈ ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. పీఆర్సీ ఆలస్యమైతే ఐఆర్ ఇచ్చే సంస్కృతిని గతంలో మొట్టమొదట 1999లో సీఎం చంద్రబాబు తీసుకొచ్చారని గుర్తు చేశారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీ ఆలస్యమవుతోందన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు తాత్కాలిక భృతి ప్రకటించి, వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జిల్లాప్రధానకార్యదర్శి తిమ్మారెడ్డి, రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ తిరుపాల్, శివారెడ్డి, ఎల్లప్ప, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిప్రసాద్

చిన్నారి పెళ్లికూతురు

పాపంపేటలో బాల్యవివాహం...!

అనంతపురం విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే ఓ పేటలో బాలికకు వివాహం చేసినట్లు తెలిసింది. తల్లిదండ్రులు తమ 14 ఏళ్ల కుమార్తెకు రహస్యంగా వివాహం చేసినట్లు సమాచారం. అనంతపురం రూరల్ మండలంలో నివాసం ఉంటున్న దంపతులు తమ మైనర్ కుమార్తెను కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన వరుడికి ఇచ్చి ఆదివారం ఉదయం వివాహం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవలే ఐసీడీఎస్, చైల్డ్ లైన్ అధికారులు బాలిక దంపతులకు కౌన్సెలింగ్ కూడా ఇచ్చినట్లు తెలిసింది. అధికారుల మాటలు బాలిక తల్లిదండ్రులు పెడచెవిన పెట్టి పెళ్లి చేసినట్లు సమాచారం. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలోనే ఇలా బాలికలకు పెళ్లిళ్లు చేస్తుంటే...ఇక జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందోననే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ బాల్య వివాహంపై ఐసీడీఎస్ పీడీ శ్రీదేవిని వివరణ కోరగా ఇటీవల తమ శాఖాధికారులు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చిన విషయం వాస్తవమేనన్నారు. ఒక వేళ రహస్యంగా పెళ్లి చేసి ఉంటే... విచారణ చేయించి వెంటనే కేసు నమోదు చేస్తామని తెలిపారు.



గాయపడిన మహిళ

కార్లపై రాళ్లదాడి

జాతీయ రహదారిపై ఘటన

ఇరువురికి గాయాలు

హిందూపురం, అక్టోబరు, 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి వెంట వెళ్తున్న కార్లపై గుర్తుతెలియని దుండగులు రాళ్లదాడి చేశారు. ఈ ఘటనలో కార్లలో ప్రయాణిస్తున్న ఇరువురికి గాయాలైనట్లు బాధితులు తెలిపారు. పెనుకొండకు చెందిన కేదరినాథ్ బెంగళూరుకు వెళ్లి అక్కడ తన కుమార్తెను పండుగ కోసం కార్లో తీసుకువస్తున్నాడు. ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో సోమందేపల్లి మండలం నల్లగొండరాయనపల్లి సమీపంలోకి వచ్చే సరికి గుర్తు తెలియని దుండగులు కారుపై రాళ్లు విసిరారు. దీంతో బెంబేలెత్తిన వారు కారును ఆపకుండా పెనుకొండకు వెళ్లారు. కారు అద్దాలు ధ్వంసమై కుమార్తె చందనకు గాయాలవగా.. భార్య అశ్విని తల కిందకు దించుకోవడంతో తప్పించుకుంది. పెనుకొండకు చెందిన భగత్ భార్య గోరంట్లకు వెళ్లి కారులో తిరిగి వస్తున్నారు. వీరికి కూడా 10 నిమిషాల వ్యవధిలో చీకట్లో నుంచి రాళ్ల దాడి చేశారు. వీరి వాహనానికి కూడా అద్దాలు పగిలాయి. కారులో ఉన్న బిన్నిశ్రీకి స్వల్ప గాయాలయ్యాయి. వీరు కూడా పెనుకొండ వరకు కారు ఆపకుండా వెళ్లారు. అనంతరం వారు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి గాలించారు. ఎవరూ కనిపించకపోవడంతో వెనుతిరిగి వచ్చారు. దీనిపై ఎస్ఐ రమేష్‌ను సంప్రదించగా.. చీకట్లో ఉండి ఎవరో రాళ్ల దాడి చేశారనీ, వారు మద్యం మత్తులో చేశారా, ఆకతాయిల పనా తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని ఎస్ఐ పేర్కొన్నారు.



పగిలిన కారు అద్దాలు

పేద విద్యార్థికి ఆర్థికసాయం

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఔదార్యం



అనంతపురం అర్బన్, అక్టోబరు27(ఆంధ్ర జ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదవిద్యార్థి ఉన్నత చదువుల కోసం గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ ఆర్థిక సాయం చేశారు. అనంతపురానికి చెందిన ఓ పేద విద్యార్థిని ఉన్నత చదువులకు ఆదివారం ఆయన రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. కష్ట సమయంలో ఆర్థిక సాయం అందించి, చదువు కొనసాగించడానికి అండగా నిలిచిన గౌస్‌మొద్దీన్‌కు ఆ విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

రాయదుర్గంరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నీటి గుంతలో ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణ శివారు బీటీపీ లేఅవుట్‌లో ఆదివారం జరిగింది. ఈ లేఅవుట్‌లో నివాసం ఉం టున్న హరి, వరలక్ష్మి దంపతుల కుమారుడు కళ్యాణ్‌రామ్(19) పిల్లలతో కలిసి కాలనీ సమీపంలోని నీటి గుంత వద్దకు ఈతకు వెళ్లాడు. దరికి ఆనుకుని ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు లోతు ఎక్కువ ఉన్న ప్రాంతానికి వెళ్లి పోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఆందోళన చెందిన తోటి వారు గుంత నుంచి ఒడ్డుకు చేరుకున్నారు. ఇంతలోనే ఈతకెళ్లిన కుమారుడు ఎంతసేపటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రు లు బంధువులతో కలిసి కుమారుడిని వెదుకుతూ నీటి గుంత వద్దకు చేరుకుని పరిశీలించారు. నీటి అడుగులో ఉన్న కళ్యాణ్‌రామ్‌ను బయటకు తెచ్చి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

కొడవటిగంటి (జయంతి)



ప్రముఖ తెలుగు రచయిత 'కొకు'గా పిలవబడే కొడవటిగంటి కుటుంబరావు 1909 అక్టోబరు 28న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. 'చందమామ' పత్రికను తీర్చిదిద్దిన ప్రముఖులలో ఆయన ఒకరు. 50ఏళ్ల రచనా జీవితంలో 10వేల పేజీలకుపైగా రచనలు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాహిత్యం మారాలని అభిప్రాయపడ్డారు. జగత్తులో స్థలము, కాలము అనే రెండు కొలబద్దలే కాకుండా బుద్ధి అనేది కొలతగా పని చేస్తుందనే సిద్ధాంతాన్ని 'బుద్ధికొలతవాదం' పేరిట ప్రతిపాదించారు. 1980 ఆగస్టు 17న కన్నుమూశారు.

సూర్యకాంతం (జయంతి)



తెలుగు సినీరంగంలో వెండితెరపై 'గయ్యాళి అత్త'కు మారుపేరుగా నిలిచిన సూర్యకాంతం 1924 అక్టోబరు 28న కాకినాడ ప్రాంతం వెంకట కృష్ణరాయపురంలో జన్మించారు. నిజానికి దబాయింపూ, కచ్చితత్వమూ ఉన్న మనిషే అయినా మనసుమాత్రం వెన్న, సున్నితం. 'గుండమ్మ కథ' సినిమాతో ఎంతో పేరొందారు. ఆమె ప్రత్యేకంగా హాస్యం చెయ్యక పోయినా ఆమె సంభాషణ చెప్పేతీరు నవ్వు తెప్పి స్తుంది, చేసే చేష్టలు కోపం తెప్పిస్తాయి. సహజనట కళాశిరోమణి, హాస్యనట శిరోమణి, పద్మావతి మహిళా యూనివర్సిటీచే గౌరవ డాక్టరేట్ ఇతర గౌరవాలు అందుకున్నారు. 1994 డిసెంబరు 17న కన్నుమూశారు.

మైసూరు దొరైస్వామి అయ్యంగార్ (వర్ధంతి)



'పద్మభూషణ్' పురస్కార గ్రహీత దొరైస్వామి అయ్యంగార్ 1920లో బెంగళూరులో జన్మించారు. వీణా విద్వాంసులు. ఆలిండియా రేడియోలో సంగీత దర్శకుడిగా వ్యవహరించారు. అనేక జుగల్బందీ కచేరీలు ప్రదర్శించారు. కన్నడ కవి పీటీ నరసింహాచార్ రచించిన నాటికలకు సంగీతం సమకూర్చారు. మైసూరు యూనివర్సిటీచే గౌరవ డాక్టరేట్ పొందారు. సంగీత కళానిధి, సంగీత కళాశిఖామణి, చౌడయ్య నేషనల్ మెమోరియల్ అవార్డు తదితర పురస్కారాలు పొందారు. 1997 అక్టోబరు 28న కన్నుమూశారు.

ఇంద్రానూయి (పుట్టినరోజు)



ఇండియన్-అమెరికన్ మహిళా వాణిజ్యవేత్త, 'పద్మభూషణ్' గ్రహీత ఇంద్రా కృష్ణమూర్తి నూయి 1955 అక్టోబరు 28న చెన్నైలో జన్మించారు. పెప్సికో సంస్థ సీఈఓగా ప్రపంచస్థాయిలో అత్యధిక వేతనం పొందిన మహిళానేతగా గుర్తింపు పొందారు. 12ఏళ్లలో 80శాతం అమ్మకాలు పెంచి సత్తా చాటుకున్నారు. 2008లో ఫోర్బ్స్ జాబితాలో అత్యంత శక్తివంతమైన మహిళల్లో మూడోస్థానంలో నిలిచారు. పలు సంస్థలలో వివిధ హోదాలలో కొన సాగారు. గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. 2021లో నేషనల్ ఉమెన్స్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించు కున్నారు. 2022లో గోల్డెన్ బుక్ అవార్డ్సునుంచి సత్కారం అందుకున్నారు.

బిల్‌గేట్స్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన వ్యాపారవేత్త బిల్‌గేట్స్ 1955 అక్టోబరు 28న వాషింగ్టన్‌లో జన్మించారు. పూర్తి పేరు విలియం హెన్రీగేట్స్-3. సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కంపెనీ సహసంస్థాపకులు, మానవతావాది. కంప్యూటర్లను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన వ్యక్తిగా పేరొందారు. ప్రపంచంలో అత్యంత ధనవంతులలో ఒకరు. బిల్ అండ్ మెలిండాగేట్స్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టుకోసం 2008 జూన్ 28న మైక్రోసాఫ్ట్‌లో తన కార్యకలాపాలకు వీడ్కోలు పలికారు. పలు గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణ రంగాలలో ఆయన సేవలకు 2015లో భారత ప్రభుత్వం నుంచి 'పద్మభూషణ్' పురస్కారం అందుకున్నారు.

బినిం (పుట్టినరోజు)



బాపుగారి ప్రియశిష్యుడు, బినింగా పేరొందిన భమిడిపల్లి నరసింహమూర్తి 1957 అక్టోబరు 28న తూర్పు గోదావరి జిల్లా ఆత్రేయపురంలో జన్మించారు. చిత్రకారుడు, కార్టూనిస్ట్, కవి, కథారచయిత. నాలుగుసార్లు నంది అవార్డు పొందిన టీవీ రచయిత. కళారత్న బిరుదాంకితుడు. ఎడిటింగ్, డిజైనింగ్, డబ్బింగ్, మాడ్యులేషన్, టీవీ టైటిల్స్ తదితర అన్ని విభాగాల్లో పనిచేశారు. పలు గౌరవాలు అందుకున్నారు. 2023 డిసెంబరులో సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అడ్వైజరీ ప్యానెల్ మెంబర్‌గా నియమితులయ్యారు.

జూలియా రాబర్ట్స్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన నటి, నిర్మాత జూలియా రాబర్ట్స్ 1967 అక్టోబరు 28న జార్జియాలో జన్మించారు. 1990వ దశకంలో అత్యధిక రెమ్యూనరేషన్ పొందిన నటి. హాలీవుడ్‌లో మూడు గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ పొందారు. ఉత్తమనటిగా అకాడమీ అవార్డు గ్రహీత. తన సంపాదనలో యునిసెఫ్‌తోపాటు ఇతర చారిటీ సంస్థలకు ఇచ్చారు. ఆమె 'రెడ్ ఓం ఫిల్మ్స్' అనే ప్రొడక్షన్ కంపెనీని నిర్వహిస్తున్నారు.

నమోదు చేసుకోవాలి

అనంతపురం విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ (సిమ్)కు ఈనెల 28వ తేదీలోగా టీమ్స్ రిజిస్ట్రేషన్ చేయాలని డీఈఓ ప్రసాద్ బాబు, ఏపీసీ నాగరాజు, సైన్స్ ఆఫీసర్ బాలమురళీకృష్ణ ఆదివారం ప్రకటనలో సూచించారు. ప్రతి స్కూల్ నుంచి https://schoolinnovationmarathon.org వెబ్‌సైట్‌లో ముగ్గురు విద్యార్థులతో ఒక టీం చొప్పున మూడు టీమ్స్‌ను తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాలన్నారు.

ఆశ్రమంలో నోడల్ అధికారి తనిఖీలు



నిరాశ్రయుల కేంద్ర పరిశీలనలో అధికారులు

బంగారపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాలూకా నోడల్ అధికారి నాగరాజ్ వివిధశాఖల అధికారులతో కలసి నిరాశ్రయుల కేంద్రాన్ని, పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పథకాలు అమలవుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పట్టణంలోని అతిథిగృహంలో నోడల్ అధికారి నాగరాజ్ ప్రత్యేకంగా సమావేశమై వివిధశాఖల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. రామపుర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మించేందుకు హులిబెలె సర్వే నెంబరు 34లో 5 కుంటల భూమిని మంజూరు చేశామని, ముష్ట్రహళ్ళి చెరువు సమీపాన వర్షం నమోదు కేంద్రాన్ని ఆరంభించేందుకు సంబంధితశాఖకు విన్నవించామని తహసీల్దార్ వెంకటేశప్ప వివరించారు. సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో తాలూకాలో 17 హాస్టళ్లు ఉన్నా కేవలం నలుగురు మాత్రమే పర్మనెంట్ సిబ్బంది ఉండడంతో నిర్వహణ సమస్య ఉందని వివరించారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఇచ్చేందుకు గ్రాంట్ల కొరత ఉందని సాంఘిక సంక్షేమశాఖ ఏడీ అంజలిదేవి వివరించారు. తాలూకా వ్యాప్తంగా గాలికుంటు వ్యాధి నియంత్రణకు టీకాలు వేసే కార్యక్రమంతోపాటు పశుగణన ప్రక్రియ కొనసాగుతోందని మూడు నెలల్లో పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్టు పశుసంవర్ధకశాఖ అధికారులు వివరించారు. నోడల్ అధికారి నాగరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చేయడంలో అధికారులపై బాధ్యత ఉందని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దారు వెంకటేశప్ప, సీడీపీఓ మునిరాజు, సాంఘిక సంక్షేమ అధికారి అంజలిదేవి, బీఈఓ గురుమూర్తి, అక్షరదాసోహ యువరాజు, వెనుకబడిన వర్గాల సంక్షేమశాఖ ఏడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్వహణ ఈఎల్‌సీఐటీకి ఇవ్వండి

▸▸ బయోకాన్ చైర్మన్ కిరణ్ మజుందార్ షా

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో మౌలిక సదుపాయాలపై తరచూ విమర్శలు వస్తుంటాయి. బెంగళూరులో చిన్న సమస్య ఏర్పడినా జాతీయ, అంతర్జాతీయస్థాయిలో నెటిజన్లు స్పందిస్తుంటారు. ఇటీవల వర్షాలకు నగరంలో రోడ్లు అధ్వానంగా మారాయి. ఈమేరకు బయోకాన్ సంస్థ ఎండీ కిరణ్ మజుందార్‌షా స్పందించారు. రోడ్లపై గుంతలు పూడ్చేందుకు బీబీఎంపీ కంట్రాక్టర్‌లకు ఎందుకు పనులు ఇస్తారని ఎక్స్ ద్వారా శనివారం ప్రశ్నించడం సంచలనమైంది. ఎలక్ట్రానిక్ సిటీ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ (ఇఎల్‌సిఐటి) అథారిటీకి ఇవ్వాలని సూచించారు. మన కోసం నాణ్యతగా పనిచేసే ఇఎల్‌సిఐటి ఉన్నప్పుడు, నాసిరకం పని చేసే కంట్రాక్టర్‌లకు ఎందుకు ఇస్తారని ప్రశ్నించారు. ప్రత్యేకించి ట్రాఫిక్ అధికంగా ఉండే సర్కిల్‌లు, రోడ్లు ఎందుకు పనులు మార్చరాదని డీసీఎం డీకే శివకుమార్, ఐటీ మంత్రి ప్రియాంక ఖర్గేలకు ట్యాగ్ చేశారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని అదే పెను సమస్యగా మారుతోందని కామెంట్ చేశారు. బొమ్మనహళ్ళిలో ఇఎల్‌సిఐటి ఆధ్వర్యంలో నిర్మించిన ఓ సర్కిల్ అంటూ పోస్ట్ చేశారు. బెంగళూరు శివారులోని 902 ఎకరాల విస్తీర్ణంలోని పారిశ్రామికవాడలో 300కుపైగా కంపెనీలు కల్గి ఇఎల్‌సిఐటి సంస్థ అన్నారు.

కిరం, లంకేశ్ నివాసాలు.. యూనివర్సిటీలు

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్తలు కిత్తానె రంగణ్ణ (కిరం) నాగరాజ్, లంకేశ్ నివాసాలు యూనివర్సిటీల వంటివని సాంస్కృతిక విమర్శకుడు శూద్ర శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. నగరంలోని కన్నడ భవన్‌లో సంస్థ థియేటర్, రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన కె.ఎస్.విజయలక్ష్మి అనువాద కావ్యకమ్మట, పురస్కార ప్రదానంలో పాల్గొని మాట్లాడారు. విశ్వవిద్యాలయాల తరహాలో కిరం, లంకేశ్‌లు చక్కటి రచనలతో పాఠకులను ఆకట్టుకున్నారని కొనియాడారు. వారానికి నాలుగురోజులు వారి ఇళ్లల్లో పలు అంశాలపై చర్చాగోష్ఠులు ఉండేవన్నారు. పాఠకులలో ఆసక్తిని పెంచే కథనాలు ఉండేవన్నారు. విజయలక్ష్మి అనువాద రంగంలో రాణించారన్నారు. కార్యక్రమంలో కెఎస్ సహనా, కవనా, చందన, షడక్షర పీఠం అధ్యక్షుడు కుడ్లూరు వెంకటేశప్ప, సంస థియేటర్ సురేశ్, జయరాము, అధ్యాపకుడు డాక్టర్ రుద్రేశ్ అదరంగి తదితరులు పాల్గొన్నారు.



రచయిత్రి విజయలక్ష్మికి సన్మానం

ఆకట్టుకుంటున్న సోలో ఆర్ట్ ప్రదర్శనలు



ప్రదర్శనను ప్రారంభిస్తున్న బాలసుబ్రమణియన్ తదితరులు

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్ట్ హౌస్‌లో నిఖిల్ ఇనయా సోలో ఆర్ట్ ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. మెమెంటో మోరి శ్రద్ధాంజలి పేరిట భిన్నమైన కళాఖండాలను ఏఆర్ బాలసుబ్రమణియన్ ప్రదర్శనలు ప్రారంభించారు. అవ్వ శాంతనాయకి బాలసుబ్రమణియన్ స్ఫూర్తితో కళాఖండాలను రూపొందించినట్టు ఇనయా తెలిపారు. ప్రదర్శనలో జీవనంలోని క్షణిక సౌందర్య సన్నివేశాలను ప్రతిబింబించేలా ఉన్నాయని వీక్షకులు అభిప్రాయపడ్డారు. ఈనెల 29వరకు ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు.

పశువులకు టీకాలు వేయించండి



గాలికుంటు వ్యాధి టీకాల ప్రారంభంలో డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు

బాగేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి ప్రాణాంతకంగా మారిన నేపథ్యంలో పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్య శాఖ సహాయక డైరెక్టర్ డాక్టర్ ఎస్ఇ కృష్ణమూర్తి తెలిపారు. తాలూకాలోని గూళూరు డెయిరీ ఆవరణలో పశువైద్యశాఖ, కోచిముల్ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధికి టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆవులు, ఎద్దులు, గేదెలు, పందులలో గాలికుంటు వ్యాధి కనిపిస్తోందన్నారు. వ్యాధి సోకితే శారీరక సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. ప్రతి గ్రామంలోనూ టీకాలపై అవగాహన కల్పిస్తూ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరు నెలలకోసారి ఇలాంటి టీకాలు పశువులకు వేయించాలన్నారు. బాగేపల్లి శిబిరం కోచిముల్ డిప్యూటీ మేనేజర్ గుర్రప్ప మాట్లాడుతూ కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాల్లో రైతులు పాడిపెంపకంతో జీవనం సాగిస్తున్నారని, గాలికుంటు వ్యాధితో పశువులలో పాలదిగుబడి తగ్గుతుందన్నారు. టీకాల ద్వారా పశువుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సందర్భంగా తాలూకాపంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎస్ఎస్ రమేశ్‌బాబు, డెయిరీ అధ్యక్షుడు నరసింహప్ప, ముఖ్య పశువైద్యాధికారి డాక్టర్ జయశంకర్, కోచిముల్ డాక్టర్ గౌతమ్, ఉన్నతాధికారులు మునిస్వామిరెడ్డి, డెయిరీ ఉపాధ్యక్షుడు బాబురెడ్డి, కార్యదర్శి జిసి వినయకుమార్, డైరెక్టర్‌లు రామచంద్రప్ప, అమానుల్లా, నరసింహప్ప, సుజాతమ్మ, నారాయణస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

నవంబరు 23న ఆరోగ్యజ్యోతి అవార్డుల ప్రదానం



మీడియాతో రాఘవేంద్ర తదితరులు

మహదేవపుర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య రంగంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సాధకులను గుర్తించి ఇదే తొలిసారిగా నవంబరు 23న గాంధీ భవన్‌లో ఆరోగ్యజ్యోతి అవార్డ్స్ కర్ణాటక 2024 ను ప్రదానం చేయనున్నట్టు రాఘవి చారిటబుల్ ట్రస్టు అండ్ సేవా ఫౌండేషన్ ముఖ్యులు రాఘవేంద్ర తెలిపారు. కేఆర్‌పురలోని శ్రీలక్ష్మి తల్లీబిడ్డ ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఆసు పత్రులలో పనిచేసే డి గ్రూప్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, లేబరేటరీల్లో పనిచేసే సుమారు 70మంది సాధకులకు అవార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. తమ సంస్థ వెబ్‌సైట్‌లోని అర్జీలను భర్తీ చేసి నవంబరు 15లోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. తమ సంస్థ నిపుణుల బృందం పరిశీలించి సాధకులను గుర్తిస్తారన్నారు. అవార్డుల ప్రదానోత్సవంలో ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావు, ఐటీబీటీ మంత్రి ప్రియాంక ఖర్గే, కార్మిక మంత్రి సంతోష్‌లాడ్, ఎమ్మెల్యే చేకూరు గోపాలకృష్ణ, భైరతి బసవరాజ్, సీటీ రవి తదితరులు విచ్చేస్తారన్నారు. ఆసుపత్రి గ్రూప్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సాంబశివ మాట్లాడుతూ నర్సులకు నైటింగేల్ పురస్కారాలు, డాక్టర్‌లకు అత్యుత్తమ వైద్యులు, ఇతరులకు ఉత్తమ సిబ్బంది వంటి పురస్కారాలు ఉంటాయన్నారు. మీడియా సమావేశంలో డాక్టర్ సందీప్, డాక్టర్ మంజునాథ్, సమాజ సేవకుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో విజిలెన్స్ వాకథాన్



ప్లకార్డులతో ప్రదర్శన ఇలా..

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా నగరంలో ఆదివారం వాకథాన్ జరిగింది. కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థలు హెచ్ఏఎల్, బీఈఎంఎల్, బీఈఎల్, బీఎంఆర్‌సీఎల్‌లకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. టౌన్‌హాల్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలగుండా వాకథాన్ సాగింది. సమాజంలో అవినీతి నిర్మూలన జరిగితేనే సమసమాజం, అభివృద్ధి సాధ్యమని ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయండి



ఖాళీగా పడిన మద్యం ప్యాకెట్, బాటిళ్లు

బాగేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన బాగే పల్లి పట్టణంలో చిన్న వ్యాపారులకు అనుకూలంగా పురసభ ఆధ్వర్యంలో గతంలో కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసింది. సదరు వాణిజ్య సముదాయం సాయంత్రం వేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే విమర్శలు ఉన్నాయి. నేతాజి సర్కిల్‌లో పీఎల్‌డీ బ్యాంకు ఎదురుగా పలువురు కూరగాయల వ్యాపారానికి వీలుగా చిన్నపాటి వాణిజ్య సముదాయం ఉంది. సాయంత్రం వేళ సముదాయంలో రద్దీ ఉండదు. దీంతో ఈ ప్రదేశం తాగుబోతులకు అడ్డాగా ఉంటూ అసాంఘిక కార్య కలాపాలకు వీలుగా మారిందనే పలువురు విమర్శిస్తున్నారు. ఎటు చూసినా ఖాళీ అయిన మద్యం ప్యాకెట్‌లు, బాటిళ్లు పడి ఉండడం ఇందుకు ఊతమిస్తోంది. స్థానికంగా తాగుబోతుల ఆగడాలు చుట్టుపక్కల నివాసాలవారికి తలనొప్పిగా మారింది. సీపీఎం నాయకుడు చన్నరాయప్ప మాట్లాడుతూ ఏడెనిమిదేళ్లక్రితం పట్టణ హృదయభాగంలో కూరగాయల వ్యాపారులకు వీలుగా ప్రజలకోసం అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించారన్నారు. ప్రస్తుతం తాగుబోతులకు అడ్డాగా మారడం విచారకరమన్నారు. కూరగాయల వాణిజ్య సముదాయం సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో భారీ నిరసన చేపడతామన్నారు. బాగేపల్లి పురసభ ముఖ్య అధికారి శ్రీనివాస్ స్పందిస్తూ వాణిజ్య సముదాయాన్ని ఇటీవల స్వచ్ఛపరిచామన్నారు. అంతే కాకుండా ఇప్పటికే వాణిజ్య సముదాయాన్ని బాగుచేసేందుకు సభలో నిర్ణయం తీసుకున్నామన్నారు. త్వరలోనే పూల వ్యాపారులకు వీలు కల్పించి వ్యాపారులకు సదుపాయం కల్పిస్తామన్నారు.

బిదరె అగ్రహార చెరువుకు వాయనం



వాయనం సమర్పిస్తున్న మాజీ మంత్రి లింబావళి

బెంగళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని దొడ్డబనహళ్ళి పంచాయతీ పరిధిలోని బిదరె అగ్రహార చెరువు నిండడంతో మాజీ మంత్రి అరవింద లింబావళి స్వయంగా వాయనం సమర్పించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ వర్షాలతో చెరువులు జలకళ సంతరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తద్వారా భూగర్భజలమట్టం పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా బెంగళూరు రూరల్ బీజేపీ అధ్యక్షుడు నటరాజ్, గ్రామపంచాయతీ అధ్యక్షుడు అనిల్, ప్రముఖులు పాపణ్ణ, లింగరాజ అరసు, లోకేశ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బురుడుగుంటెలో బస్‌షెల్టర్ నిర్మించాలి

చేళూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బురుడుగుంటెలో గ్రామ పంచాయతీ కేంద్రంలో ప్రయాణీకుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ కొంతకాలంగా ఉంది. గ్రామపంచాయతీ కేంద్రం కావడంతో చుట్టుపక్కల గ్రామాలవారు పెద్దసంఖ్యలో వస్తుంటారు. స్థానికంగా గంగమ్మ దేవాలయానికి దూర ప్రాంతాలనుంచి భక్తులు వస్తుంటారు. ప్రత్యేకించి ఆది, మంగళ, శుక్రవారాలలో భక్తుల సందడి ఉంటుంది. స్థానికంగా గ్రామకేంద్రంలో సరైన బస్‌షెల్టర్ లేకపోవడంతో దుకాణాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో తగిన బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని భక్తులు, ప్రయాణీకులు కోరుతున్నారు. గ్రామపంచాయతీ కేంద్రం అభివృద్ధికి తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు.

సోమేశ్వర ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

శిడ్లఘట్ట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిన కోటె సోమేశ్వర ఆలయ ఆధునీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. అబ్లూడు కెంపేగౌడ, భార్య అసూరమ్మ, కుమారుడు శివనేగౌడల నేతృత్వంలో కార్యక్రమాలు సాగాయి. సుమారు 500 ఏళ్ల క్రితం ఆలయం ఏర్పాటు కాగా మొఘలుల దాడిలో శిథిలావస్థకు చేరుగా రెండోసారి ఆధునీకరించుకుంది. ప్రస్తుతం ఆలయాన్ని మూడోసారి ఆధునీకరణ పనులు సాగుతున్నాయి. వేదపండితులు సత్యనారాయణశాస్త్రి, బశెట్టిహళ్ళి కృష్ణమూర్తి శర్మల నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు సాగాయి. పట్టణానికి చెందిన ప్రముఖులతోపాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ఆనంద తరంగం..!

పెన్నహోబిలం వద్ద కనువిందు చేస్తున్న జలసిరి



కనువిందు చేస్తున్న జలపాతం

ఉరవకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పారే యేటిని చూస్తే ఎవరికైనా ఆనందమే. పచ్చని పరిసరాల మధ్య వాగుల్లో హొయలు పోతూ ప్రవహించే జలసిరిని చూస్తే పరవశమే. ప్రకృతి ప్రేమికులు ఇలాంటి ప్రాంతాలను సందర్శిస్తూ ఆనందానుభూతిని పొందుతుంటారు. ఇలాంటి ఆనందానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది పెన్నహోబిలం నారసింహుడి క్షేత్రం. తుంగభద్ర డ్యాం నుంచి మిడ్ పెన్నార్ డ్యాంకు నీటిని విడుదల చేయడంతో ఇక్కడి వాగులో ప్రవాహం కనువిందు చేస్తోంది. సెలవు రోజు కావడంతో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వచ్చారు. పిల్లలతో కలిసి నీటిలో ఆనందంగా ఈత కొట్టారు. సెల్ఫీలు దిగారు. అయితే ఏమరుపాటుతో చిన్న పిల్లలను నీటి వద్ద వదిలేసినా, ప్రమాదకర విన్యాసాలు చేసినా తీరని నష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,609.25
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	17,145	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	14,977	9,066
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	96.12

మాలవి జలాశయం భర్తీ

● 150 క్యూసెక్కుల నీరు విడుదల ● క్రస్ట్‌గేట్ల భద్రతపై రైతుల ఆందోళన ● నిర్వహణలో అధికారులు విఫలం

బళ్లారి సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకాలోని మాలవి జలాశయం నిండింది. దీంతో ఆదివారం రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని రిజర్వాయర్ అసిస్టెంట్ ఇంజనీర్ హాలిరాజ్ తెలిపారు. ఈ సంవత్సరంలో రిజర్వాయర్ నిండింది. క్రస్ట్‌గేట్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు వృథా వెళుతోంది. గేట్ల భద్రతపై రైతుల్లో ఆందోళన నెలకొంది. 7,326 ఎకరాల ఆయకట్టుకు నీరందించే ఈ జలాశయం రైతులకు జీవనాధారం. దీని వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. ఎడమ, కుడి గట్టు కాలువల ద్వారా పట్టణంతోపాటు మాలవి, హరేగొండనహళ్లి, చింత్రపల్లి, కడలబాలు, బాచిగొండనహళ్లి, బ్యాసగిదేరి, హిరేసోబటిగే తదితర ప్రాంతాలకు నీటి సౌకర్యం అందుతోంది. రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో మంచి వర్షాలు కురువడంతో తుంగభద్ర జలాశయంలోని బ్యాక్ వాటర్ నుంచి నీరందించే ప్రాజెక్టు కూడా ప్రారంభమైంది. దీంతో రిజర్వాయర్‌లో నీటి పరిమాణం పెరుగుతోంది. రిజర్వాయర్ గరిష్ఠ సామర్థ్యం 25 అడుగులు. నీటిని నిలబెట్టుకునేందుకు కర్ణాటక ఇరిగేషన్ కార్పొరేషన్ అధికారులు నానాతంటాలు పడుతున్నారు. రిజర్వాయర్‌లోని 10 క్రస్ట్‌గేట్లలో ఏదీ సరిగ్గా లేదు. రెండు నెలల్లో రెండుసార్లు మరమ్మతులు చేసినా లీకేజీ మాత్రం పూర్తిగా ఆగలేదు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రిజర్వాయర్ చుట్టూ ఉన్న గట్లపై, క్రస్ట్ గేట్లలో ముళ్లపొదలు ఏర్పడ్డాయి. ప్రమాదకరంగా ఉన్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. లక్షలు వెచ్చించి ఏడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రిజర్వాయర్‌ను చూసేందుకు వచ్చే వారు క్రస్ట్‌గేట్లకు అమర్చిన యంత్రాలపై తిరుగుతున్నా పట్టించుకునేవారులేరు. రిజర్వాయర్ శాఖ కార్యాలయం ఇక్కడ ఉన్నప్పటికీ ప్రయోజనం లేదు. ఇంజనీర్లు మునీరాబాద్‌లో ఉన్నారు. దీనిపై సమాచారం ఇవ్వాలని ఇరిగేషన్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బ్రాంచ్ అధికారికి ఫోన్ చేసినా ఫలితం లేదు. రిజర్వాయర్ రక్షణకు సిబ్బందిని కేటాయించాలని, క్రస్ట్‌గేట్ల దగ్గర పొదలను తొలగించాలని, సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మాలవి జలాశయం నుంచి కాలవలోకి వస్తున్న నీరు



స్వాధీనం చేసుకున్న నగలతో పోలీసులు

నగల స్వాధీనం

కంప్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కురుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని యల్లాపురం క్రాస్ వద్ద ఇళ్లల్లో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలను దొంగలించారు. ఈ నెల 12న స్థానికులు కురుగోడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ డాక్టర్ శోభారాణి, డీఎస్పీ ప్రసాద్ గోఖలే ఆధ్వర్యంలో కురుగోడు సీఐ విశ్వనాథ్, ఎస్ఐ సుప్రీత్, కరియమ్మ దొంగల ముఠాను పట్టుకునేందుకు ఏఎస్ఐ షెక్షావలి బృందం విచారణ చేపట్టింది. శనివారం హొస్పేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కిరణ్, విష్ణును తనిఖీ చేసి వారి వద్ద నుంచి సుమారు రూ. 5 లక్షలు విలువ చేసే 60 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

భర్త అప్పులతో భార్య ఆత్మహత్య

అనంతపురం క్రైం,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భర్త కొట్టడు.. తిట్టడు.. కానీ ఆ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు ప్రధాన కారణం భర్త ఆన్‌లైన్ జూదంలో చేసిన అప్పుల చిట్టా. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.40లక్షల అప్పు చేశాడు. పెద్దలు కుదిర్చి పెళ్లయినా భర్త అంటే బోలెడంత ఇష్టం ఆమెకు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియలేదు. భర్త ఇబ్బంది పెట్టకపోయినా పరోక్షంగా ఒత్తిళ్లు ఎదుర్కొంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ సచివాలయ ఉద్యోగిని ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం సిండికేట్‌నగర్‌లో నివాసముంటున్న సచివాలయ ఉద్యోగిని మానస ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అనంతపురం రూరల్ పోలీసులకు ఆదివారం అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మానస కూడేరు మండలం ఉదిరిపికొండ సచివాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త మల్లికార్జున శెట్టూరు మండలంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈయన ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఎక్కువగా ఆడేవాడు. ఆ క్రమంలో రూ.లక్షల్లో అప్పులు చేశాడు. చివరికి అది రూ.40లక్షల వరకు ఉన్నట్లు తేలింది. శెట్టూరు మండలంలో నాలుగు నెలల క్రితం పింఛన్ డబ్బు రూ.5.50లక్షలు కాజేసిన ఘటనలో ముద్దాయిగా జైలుకెళ్లొచ్చాడు. మానసిక క్షోభతో మానస ఆత్మహత్య చేసుకుంది.

స్థలం ఆక్రమించారని ఫిర్యాదు

అనంతపురం క్రైం,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తన స్థలం ఆక్రమించారని నగరంలోని ఓ మహిళ వన్‌టౌన్ పోలీసులకు పిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఆకుతోటపల్లి భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. వేణుగోపాల్‌గర్ మీనాక్షికి మూడున్నర సెంట్ల స్థలంలో ఎనిమిది అడుగులను భాస్కర్‌రెడ్డి ఆక్రమించారని ఫిర్యాదులో ఆరోపించింది.

కట్టుదిట్టంగా పీడీఓ పరీక్షలు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి (పీడీఓ) పోస్టులకు పరీక్షలు నిర్వహించారు. షర్టులు వేసుకుని పరీక్షా కేంద్రానికి వచ్చిన అభ్యర్థులు సగానికి కోసుకుని కేంద్రంలోకి వెళ్లిన ఘటన కొప్పళ నగరంలో చోటు చేసుకుంది. ఈ మధ్య కాలంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల్లో భారీగా అవకతవకలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పోటీ పరీక్షల నిర్వహణ మరింత కట్టుదిట్టం చేసింది. గతంలో వైద్యవిద్య కోర్సుల అర్హతా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు చెవి దిద్దులు, ముక్కు పుడుకలు తీసివేసి హాజరు కావాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ విధానాలు ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు తప్పలేదు. ఆదివారం కొప్పళ నగరంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు హాజరయిన పురుష అభ్యర్థులు ఫుల్‌షర్ట్‌లు వేసుని రాగా, వారిని అక్కడి సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. కర్ణాటక ఎగ్జామినేషన్ అథారిటీ ఆదేశాల మేరకు సెక్యూరిటీ సిబ్బంది చర్యలు తీసుకోవడంతో. స్నేహితులు, పరీక్షా కేంద్ర సిబ్బంది సహాయంతో పూర్తి షర్టును మోచేతి పైకి కట్ చేసుకుని పరీక్షలు రాయాల్సి వచ్చింది. అభ్యర్థులు పూర్తి చేతులతో కూడిన చొక్కాలు, జీన్స్ ధరించి పరీక్షకు హాజరు కాకూడదని, ఇందుకు సంబంధిచి అథారిటీ అధికార వెబ్‌సైట్‌లో ప్రచురించిన డ్రెస్ కోడ్‌ను తప్పని సరిగా పాటించాలని తెలిపారు. నిబంధనలు పాటించని అభ్యర్థులను పరీక్ష రాయడానికి అనుమతించబోమని అడ్మిట్ కార్డులోనే పేర్కొన్నప్పటికీ కొందరు అభ్యర్థులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మూల్యం చెల్లించక తప్పలేదు. పరీక్ష అనంతరం అక్కడి సిబ్బంది కత్తిరించిన షర్టులను చెత్తకుప్పలో పడేశారు.



కుప్పలుగా పడి ఉన్న అభ్యర్థుల షర్టు ముక్కలు

ఉప ఎన్నికల్లో విజయం సాధిస్తాం



కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణను సన్మానిస్తున్న దృశ్యం

కంప్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నపూర్ణ తుకారామ్‌ను గెలిపించుకుంటామని కుడితిని పట్టణ కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నపూర్ణ తరఫున ప్రచారంలో భాగంగా కుడితిని పరిధిలోని పలు గ్రామాలలో పర్యటించారు. రాజశేఖర్ నివాసంలో అన్నపూర్ణకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తమ వంతుగా కుడితిని పట్టణంలో మెజార్టీ అందించి విజయానికి నాంది పలుకుతామన్నారు. అభ్యర్థి అన్నపూర్ణ మాట్లాడుతూ ఈ ఉపఎన్నికల్లో మెజార్టీ ఇచ్చి గెలిపిస్తే ఈ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రాము, రఘునాథ్, తిరుమలేష్, సుంకన్న, వెంకటరమణబాబు, పంపాపతి, మోటా తిమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ ఏర్పాటు చేయండి

కంప్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేసి మత్స్యకారులను ఆదుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు చిన రాజప్ప తెలిపారు. కంప్లి కోటె వద్ద రోడ్డు పక్కనే అమ్మకాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రోడ్డుపక్కన వ్యాపారం చేయడం వల్ల ఎటు నుంచి ప్రమాదం జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నామన్నారు. వందల కుటుంబాలు చేపలు వేటాడి అమ్మకంతోనే జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మత్స్యకారులపై దృష్టి సారించి ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే గణేష్‌ను విచారించగా. త్వరలో మత్స్యశాఖ అధికారులతో చర్చించి వారికి అనువుగా స్థలం ఏర్పాటు చేస్తామని తెలిపారు.



రోడ్డుపై చేపలు అమ్ముతున్న మత్స్యకారులు

కాటేసిన కరెంటు

విద్యుదాఘాతంతో మహిళారైతు మృతి

విడపనకల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మిరప పంటకు నీళ్లు పెడుతు విద్యుదాఘాతానికి గురై మహిళా రైతు వరలక్ష్మి(32) మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం విడపనకల్లు శివారులో జరిగింది. మండలంలోని హావళిగి గ్రామానికి చెందిన పెన్నయ్య, వరలక్ష్మి దంపతులు విడపనకల్లు గ్రామంలో మిరప పంటను సాగు చేశారు. పంటకు నీళ్లు పెట్టేందుకు ఆదివారం ఉదయం వీరిద్దరూ తోట వద్దకు వచ్చారు. పెన్నయ్య బోరు మోటార్‌ను ఆన్ చేసి నీళ్లను మిరప సాళ్లకు మళ్లించమని భార్య వరలక్ష్మికి చెప్పి మరో పొలానికి వెళ్లిపోయాడు. వరలక్ష్మి మధ్యాహ్నం వరకు మిరప సాళ్లకు నీళ్లు కట్టింది. మోటారుకు కనెక్షన్ ఇచ్చిన విద్యుత్ వైరు పొలానికి ఉన్న ముళ్ల కంచెకు తగులుకుని ఉంది. ఈక్రమంలోనే కంచె వైపు నీళ్లు వచ్చాయి. గట్టుకు ఆనుకొని పారతో నీటిని మళ్లిస్తూ ఉండగా విద్యుదాఘాతానికి గురై వరలక్ష్మి అక్కడిక్కడే మృతి చెందింది. కొద్దిసేపటి తర్వాత పక్క పొలం రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హావళిగి గ్రామం నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు వరలక్ష్మి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

ఏమరుపాటుతోనే ప్రమాదం

వ్యవసాయ బోరుకు కనెక్షన్ ఇచ్చిన వైరు నుంచి పొలం గట్టుకు ఉన్న ముళ్ల కంచెకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో శనివారం విద్యుత్ అధికారులతో మరమ్మతులు చేయించారు. అక్కడక్కడ వైరుకు రంధ్రాలు ఉండటంతో ప్లాస్టర్లు వేసి చెక్ చేయించారు. ప్లాస్టర్ సరిపోకపోవడంతో ముళ్లకంచె వద్ద రంధ్రాన్ని అలాగే వదిలేశారు. ముళ్ల కంచె వద్ద విద్యుత్ సరఫరా వస్తోందని, ఎవరూ ఇటువైపు రావద్దని విద్యుత్ అధికారులు రైతు దంపతులకు సూచించారని బంధువులు తెలిపారు. అయితే మిరప పంటకు నీళ్లు పెడుతూ ఏమరుపాటున వెళ్లి వరలక్ష్మి ప్రాణాలు పోగొట్టుకుందని బంధువులు రోదించారు.



మృత దేహం వద్ద రోదిస్తున్న బంధువులు

సినిమా నుంచి రాజకీయాల్లోకి..

● నటుడిగా గుర్తింపు పొందిన బీజేపీ అభ్యర్థి హనుమంతు



బళ్లారి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సినిమాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న బంగారు హనుమంతు.. సండూరు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా తన విజయం కోసం పాడుపడుతున్నారు. ఆయన కన్నడ లో హీరోగా మూడు సినిమాలు తీశారు. బీజేపీ ముందస్తు వ్యూహంతో హనుమంతును సండూరు ఉప ఎన్నికల బరిలో దించింది. హనుమంతు 2014, 2018లో బీజేపీ నుంచి టిక్కెట్ ఆశించారు. స్థానిక నాయకులు ఆయనకు అడ్డుతగలడం వల్ల అప్పట్లో టిక్కెట్ రాలేదు. బీజేపీ పెద్దలతో బాగా పరిచయాలు ఉన్నా ఇక రాజకీయాలకు స్వస్తి చెప్పేద్దానుకుని కన్నడ సినిమాల్లో హీరోగా నటించారు. ఉప ఎన్నికల్లో అనూహ్యంగా బీజేపీ హనుమంతును సండూరు ఎన్నికల రంగంలోకి దించింది. కన్నడ సినిమాల్లో హీరోగా నటించడంతో గుర్తింపు ఉంది. మరి ఈ ఎన్నికల్లో ఆ గుర్తింపు ఎంతవరకు కలిసి వస్తుందో వేచిచూడాల్సిందే.

జోరుగా బీజేపీ ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి శ్రీరాములు

తోరణగల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సండూరు నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతు తరఫున ఆ పార్టీ ముఖ్యనాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం గంగావతి ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు బీజేపీ ప్రముఖులు కేఎస్ దివాకర్, మాజీ ఎమ్మెల్యే అనిల్ లాడ్ తదితర నాయకులు హనుమంతుతో కలిసి కొండాపురం, నిడగుర్తి, మల్లాపురం, పాత జోగినహళ్ మొదలగు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బీజేపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

● 40 గొర్రెలు మృతి ● రూ.5 లక్షలు నష్టం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఉరవకొండ పోలీసులు

బళ్లారిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణ శివారులోని అనంతపురం-బళ్లారి రహదారిపై ఆదివారం తెల్లవారుజామున గొర్రెల మందపై లారీ దూసుకెళ్లింది. దీంతో 40 గొర్రెలు మృతి చెందాయి. బళ్లారి జిల్లా సిడిగినమల గ్రామానికి చెందిన నాగరాజు, మంజునాథ అనే కాపర్లు గొర్రెలను బళ్లారికి తోలుకెళుతుండగా అనంతపురం నుంచి హొస్పేట్‌కి వెళుతున్న లారీ మందపై దూసుకెళ్లింది. 40 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందాయి. రూ.5 లక్షలు వరకూ నష్టం వాటిల్లింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వేదవతి పరవళ్లు



ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి నది

బళ్లారిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బళ్లారి తాలూకా హగరి సమీపంలో గత 20 రోజులుగా వర్షం కురుస్తోంది. అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలంలోని బీటీ ప్రాజెక్టు పరవళ్లు తొక్కడంతో హగరి, రూపనగుడి తదితర ప్రాంతాల్లో వరదనీటితో వేదావతి నది పరవళ్లు తొక్కుతోంది. నదికి ఇరువైపులా ఉన్న పంట పొలాల్లోని బోరుబావులకు నీరు పుష్కలంగా పెరుగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిక

సిరుగుప్ప, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తాలూకాలోని బాగేవడే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప సమక్షంలో బీజేపీలో చేరారు. వీరితో పాటు గ్రామ పంచాయతీ సభ్యుడు నాగరాజు చేరారు. వీరందరిని సోమలింగప్ప పూలమాలలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీజేపీ తాలూకా అధ్యక్షుడు మల్లికార్జున స్వామి, సీనియర్ నాయకులు ఈరణ్ణ గౌడ, ఎంఆర్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు బీటర్లను నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాంప్రసాద్ సిబ్బందితో కలిసి తపోవనం సర్కిల్‌లో పోలీసులు దాడులు నిర్వహించారు. మట్కా నిర్వహిస్తున్న నారాయణపురం గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ ఖాసిం, శ్రీనివాసనగర్‌కు చెందిన మంగలి రామమూర్తి, జగదీష్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,50,200, ఇతర సమాగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా మట్కా, పేకాట, బెట్టింగ్‌లు నిర్వహిస్తుంటే సమాచారం అందించాలని సీఐ కోరారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు బోయ సాయికుమార్, తలారి పోతులయ్యలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డాబాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న మరో ఐదుగురిపై న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు.

హోసూరు జోన్

పెరిగిన ధరలతో

ముల్లంగి రైతు హర్షం

హోసూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హోసూరు తాలూకాలో కురిసిన వర్షాలకు ముల్లంగి చక్కటి దిగుబడితోపాటు ధరలు పెరగడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హోసూరు సమీపాన బాగలూరు సమీపంలోని ఉద్దన్నపల్లి, ఆవలపల్లి, కెలవరపల్లి, శూలగిరి పరిసర ప్రాంతాల్లో రైతులు తక్కువ కాలంలో పండే ముల్లంగి, టమోటా, పాలకూర, కొత్తిమీర వంటి కూరగాయల పంటలను పండిస్తున్నారు. ఇక్కడ పండించే పండ్లు, కూరగాయాలల్లో బెంగళూరు, సేలం, కోయంబత్తూరు, ఈరోడ్ మొదలైన ప్రాంతలకు ఆకు కూరలు విక్రయిస్తారు. ఇందులో ముఖ్యంగా 45 రోజుల్లో పండే ముల్లంగిని స్థానికంగా ఎక్కువగా సాగు చేస్తారు. గత కొన్ని రోజులుగా హోసూరు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముల్లంగిసాగుకు అవసరమైన నీటి లభ్యత కారణంగా ముల్లంగి నాణ్యతగా దిగుబడి రావడం, కనీస ధర ఉండడంతో రైతులలో హర్షం వ్యక్తం అవుతోంది. స్థానిక వ్యాపారులే కాకుండా డి-మార్ట్, స్మార్ట్ బజారు, కార్పొరేట్ దుకాణల దార్లు కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. తోటల్లోనే కిలో రూ.20-25కు కొనుగోలు చేస్తున్నారు. రిటైల్ మార్కెట్‌లో ముల్లంగి కిలో రూ.30-40 ధర పలుకుతోంది.



నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

వైభవంగా ప్రసన్న వెంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



గరుడోత్సవంలో స్వామివారు

హోసూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపాన తొరపల్లి అగ్రహారంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి పవిత్రోత్సవాలు శనివారంతో వైభవంగా ముగిశాయి. ప్రతి సంవత్సరం దేవాలయ వార్షికోత్సవ సందర్భంగా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా గురువారం ప్రారంభమైన ఉత్సవాలలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చందన అలంకరణ చేశారు. అదేరోజు సాయంత్రం పల్లక్కి ఉత్సవాల్లో స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పుర వీదుల్లో ఊరేగించారు. శుక్రవారం ఉదయం నుంచి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం శ్రీచక్రహోమం, మృత్యుంజయ హోమాలు సాగాయి. శనివారం సాయంత్రం గరుడవాహనంపై శ్రీవారిని ఊరేగించారు. మూడు రోజుల పాటు దేవాలయంలో ధార్మిక కార్యక్రమాల్లో స్వామివారి కీర్తనలు, భక్తి పాటలతో భక్తులు పరవశులయ్యారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నసంతర్పణ సాగింది.



హోమం నిర్వహిస్తున్న పండితులు